సాక్షి అనకాపల్లి

శుక్రవారం । 26 । ఏప్రిల్ । 2024



పుస్తకావిష్కరణ

విశాఖ: గురజాడ తదితరుల కథలతో ముద్రించిన కళింగాంధ్ర కథా జాడ పుస్తకాన్ని వీసీ ప్రసాదరెడ్డి ఆవిష్కరించారు.



ఘనంగా పంచామృతాభిషేకం

విశాఖ: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు.

గరిష్ఠం/కనిష్ఠం
39.0/27.0

వాతావరణం

తేలికపాటి జల్లులు లేదా ఒక మోస్తారు వర్షాలు ఒకటి రెండు చోట్ల కురిసే అవకాశముందని ఆర్ఏఆర్ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి తెలిపారు.

ముగిసిన నామినేషన్ల పర్వం

- చివరి రోజున భారీగా దాఖలు
- యలమంచిలి అసెంబ్లీకి అత్యధికంగా 34, చోడవరానికి అత్యల్పంగా 15 నామినేషన్లు
- మాడుగులలో ఇద్దరు టీడీపీ రెబల్స్
- పార్లమెంట్‌కు టీడీపీ రెబల్ అభ్యర్థిగా పైలా ప్రసాదరావు

29 ఎంపీకి 148 అసెంబ్లీకి

సాక్షి, అనకాపల్లి: సార్వత్రిక సంగ్రామంలో తొలి ఘట్టమైన నామినేషన్ల స్వీకరణ గడువు గురువారం మధ్యాహ్నం 3 గంటలతో ముగిసింది. చివరి రోజు జిల్లాలో భారీగా నామినేషన్లు దాఖలయ్యాయి. అనకాపల్లి పార్లమెంట్‌కు 25 మంది 29 సెట్లు, 6 అసెంబ్లీలకు 76 మంది 148 సెట్ల నామినేషన్లు వేశారు. అత్యధికంగా యలమంచిలి నియోజకవర్గంలో 34 సెట్ల నామినేషన్లు వేయగా.. రెండో స్థానంలో అనకాపల్లి అసెంబ్లీకి 30 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. అత్యల్పంగా చోడవరం అసెంబ్లీ స్థానానికి 15 సెట్ల నామినేషన్లు వేశారు. మాడుగుల టీడీపీ అసెంబ్లీ అభ్యర్థిగా ప్రకటించి బీ-ఫారం ఇవ్వకపోవడంతో మాడుగుల అసెంబ్లీతో పాటు అనకాపల్లి పార్లమెంట్‌కు టీడీపీ రెబల్ అభ్యర్థిగా పైలా ప్రసాదరావు నామినేషన్ వేశారు. కాంగ్రెస్ నుంచి గారా సూర్యారావు, వేగి వెంకటేష్, బీఎస్పీ నుంచి పలకా శ్రీరామమూర్తి, సమాజవాదీ పార్టీ నుంచి గురవయ్య కోనా నామినేషన్లు వేశారు. స్వతంత్ర అభ్యర్థులుగా 11 మంది బరిలో దిగారు. ఆఖరి రోజైన గురువారం ఎంపీ స్థానానికి 12 నామినేషన్లు దాఖలయ్యాయి. కలెక్టర్, రిటర్నింగ్ అధికారి రవిపట్టన్ శెట్టి నామినేషన్ పత్రాలను స్వీకరించి ప్రతిజ్ఞ చేయించారు.

మే 13న జరిగే ఎన్నికల కోసం భారత ఎన్నికల కమిషన్ మార్చి 16వ తేదీన షెడ్యూల్ విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ షెడ్యూల్ ప్రకారం ఈనెల18 నుంచి గురువారం వరకు అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరించారు. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల వరకూ నామినేషన్ల స్క్రూటినీ ఉంటుంది. ఈ నెల 29వ తేదీ వరకూ నామినేషన్ల ఉపసంహరణ గడువు ఉంది.

అనకాపల్లి పార్లమెంట్‌కు..

అనకాపల్లి పార్లమెంట్ పరిధిలో మొత్తం మొత్తం 25 నామినేషన్లు, 29 సెట్‌లు వేశారు. వైఎస్సార్‌సీపీ-5, బీజేపీ-4, కాంగ్రెస్-3, సమాజ్‌వాది పార్టీ-1, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా-1, జై భారత్ నేషనల్ పార్టీ-1, భారత చైతన్య యువజన పార్టీ-1, బీఎస్పీ-1, దళిత బహుజన పార్టీ-1, నవరాంగ్ కాంగ్రెస్‌పార్టీ-1, ఇండిపెండెంట్‌లు-10 నామినేషన్‌లు దాఖలు చేశారు.

ఇందులో గుర్తింపు పొందిన పార్టీల నుంచి 9 మంది అభ్యర్థులు నామినేషన్ వేశారు. వైఎస్సార్‌సీపీ నుంచి బూడి ముత్యాలనాయుడు, భీశెట్టి వెంకట సత్యవతి(డమ్మీ అభ్యర్థి) నామినేషన్ దాఖలు చేయగా.. బీజేపీ నుంచి రమేష్ మున్నయ్య చింటకుంట, ఆయన సతీమణి చింటకుంట రమేష్ శ్రీదేవి నామినేషన్ దాఖలుచేశారు.

అసెంబ్లీలకు..

మాడుగుల నుంచి టీడీపీ రెబల్ అభ్యర్థిగా రామానాయుడు, పైలా ప్రసాదరావు నామినేషన్లు వేశారు. వివిధ పార్టీల నుంచి అభ్యర్థులతో పాటు వారి కుటుంబ సభ్యులు నామినేషన్లు వేశారు.

- అనకాపల్లి నియోజకవర్గంలో మొత్తం 15 మంది 30 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. వైఎస్సార్‌సీపీ-4, జనసేన-4, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్-5, బీఎస్పీ-2, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా-2, జై భారత్ నేషనల్‌పార్టీ-1, ప్రేమ్‌జనతాదళ్-2, రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా-1, ప్రజాప్రస్థానం పార్టీ-1, ఎస్పీ-1, స్వతంత్ర అభ్యర్థులు- 7 నామినేషన్లు దాఖలు చేశారు.
- పాయకరావుపేట నియోజకవర్గంలో మొత్తం 11 మంది 18 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. వీటిలో వైఎస్సార్‌సీపీ-4, టీడీపీ-4, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్-3, జైభారత్ నేషనల్ పార్టీ -1, సమాజ్‌వాదీ పార్టీ-1, బహుజన సమాజ్‌వాదీ పార్టీ-1, ప్రభుత్వ రిపబ్లికన్ పార్టీ-1, ఇండిపెండెంట్ అభ్యర్థులు ముగ్గురు నామినేషన్లు వేశారు.
- నర్సీపట్నం నియోజకవర్గంలో మొత్తం 10 మంది 22 సెట్ల నామినేషన్లు వేశారు. వైఎస్సార్‌సీపీ-8, టీడీపీ-5, భారత జాతీయ కాంగ్రెస్-2, జై భీమ్‌రావ్ భారత్ పార్టీ-1, బీఎస్పీ-2, భారత చైతన్య యువజన పార్టీ-1, స్వతంత్రులు-3 నామినేషన్లు దాఖలు చేశారు.
- యలమంచిలి నియోజకవర్గంలో 18 మంది 34 సెట్ల నామినేషన్లు వేశారు. వైఎస్సార్‌సీపీ-8, జనసేన-5, బీఎస్పీ-2, జై భారత్ నేషనల్ పార్టీ-1, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా-1, కాంగ్రెస్-3, నవరంగ కాంగ్రెస్ పార్టీ 2, రిఫామ్స్ ఆఫ్ ఇండియా-1, భారత చైతన్య యువజన పార్టీ-1, స్వతంత్ర-10 అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేశారు.
- మాడుగుల నియోజకవర్గంలో 14 మంది 29 సెట్లు వేశారు. వైఎస్సార్‌సీపీ-7, టీడీపీ-5, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్-3, బీఎస్పీ-2, స్వతంత్ర అభ్యర్థులు-12 నామినేషన్ దాఖలు చేశారు.
- చోడవరం నియోజకవర్గంలో 8 మంది 15 సెట్లు నామినేషన్లు వేశారు. వైఎస్సార్‌సీపీ-4, టీడీపీ-5, కాంగ్రెస్-2, సీపీఐ(లిబరేషన్ పార్టీ)-1, బీఎస్పీ-1, ఇండిపెండెంట్‌లు-2 నామినేషన్ దాఖలు చేశారు.



మాడుగుల మండలంలో ఘాట్‌రోడ్ జంక్షన్ నుంచి వైఎస్సార్‌సీపీ శ్రేణుల భారీ ర్యాలీ. (ఇన్‌సెట్) తండ్రి ముత్యాలనాయుడితో కలసి ఆర్వో సత్యవాణికి నామినేషన్ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి అనురాధ

మాడుగులలో కోలాహలంగా అనురాధ నామినేషన్

మాడుగుల: వైఎస్సార్‌సీపీ మాడుగుల ఎమ్మెల్యే అభ్యర్థి ఈర్లె అనురాధ నామినేషన్ కార్యక్రమం గురువారం కోలాహలంగా జరిగింది. తారువలో మర్లమాంబ అమ్మవారి దీవెనలు అందుకుని, ఉత్తరాంధ్ర ఇలవేల్పు మాడుగుల మోదకొండమ్మ అమ్మవారిని దర్శించుకుని, తల్లిదండ్రులు డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, రమణమ్మలకు పాదాభివందనం చేసి భారీగా ర్యాలీగా వెళ్లి రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో 50 వేల మందికిపైగా పార్టీ శ్రేణులు, అభిమానులు పాల్గొన్నారు.దేవరాపల్లి మండలం తారువలో ప్రారంభమైన ర్యాలీ సుమారు 30 కిలోమీటర్లు సాగి, ఘాట్‌రోడ్ జంక్షన్‌కు చేరుకుంది. అక్కడ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో నామినేషన్ అందజేశారు. ఈ సందర్భంగా జై జగన్ నినాదాలు మిన్నంటాయి. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా అభ్యర్థులు, వేసిన నామినేషన్లు

నియోజకవర్గం	అభ్యర్థులు	సెట్లు
అనకాపల్లి	15	30
పాయకరావుపేట	11	18
నర్సీపట్నం	10	22
యలమంచిలి	18	34
మాడుగుల	14	29
చోడవరం	08	15
మొత్తం	76	148

పార్లమెంట్‌కు చివరి రోజు 12 మంది నామినేషన్లు

తుమ్మపాల: అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గానికి చివరి రోజు గురువారం 12 మంది నామినేషన్లు దాఖలు చేశారు. స్వతంత్ర అభ్యర్థులుగా ఆరుగురు నామినేషన్లు వేశారు. టీడీపీ రెబల్ అభ్యర్థి పైలా ప్రసాదరావు, బీజేపీ నుంచి సి.ఎం.రమేష్, డమ్మీగా అతని భార్య శ్రీదేవి తదితరులు జిల్లా ఎన్నికల అధికారి రవి పట్టన్‌శెట్టికి నామినేషన్లు సమర్పించారు.

న్యూస్‌రీల్

పీఎం రాష్ట్రీయ బాల పురస్కార్‌కు దరఖాస్తుల ఆహ్వానం

తుమ్మపాల: ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్-2024కు అర్హులైన బాలబాలికల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐసీడీఎస్ పీడీ అనంతలక్ష్మి ఓ ప్రకటనలో తెలిపారు. సాంస్కృతిక, కళలు, క్రీడలు, సమాజ సేవ, పాండిత్యం, సాహస రంగాలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారి నుంచి భారత ప్రభుత్వ మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన భారతీయ బాలల ఈ ఏడాది జూలై 31వ తేదీ నాటికి 5 సంవత్సరాలు నిండి, 18 ఏళ్ల వయస్సు దాటని వారు అర్హులని, ఎంపికైన బాలలకు రాష్ట్రపతి చేతుల మీదుగా పతకం, నగదు, ధ్రువీకరణ పత్రం అందజేస్తారని పేర్కొన్నారు. అర్హులైన బాలలు ఈ ఏడాది జూలై 30వ తేదీలోగా ఆన్‌లైన్‌లో నామినేషన్లు సమర్పించాలని కోరారు. పూర్తి వివరాలు https://awards.gov.in ద్వారా తెలుసుకోవచ్చు.

నేటి నుంచి యథావిధిగా బెల్లం లావాదేవీలు

- వర్తకులు, కొలగార్ల మధ్య వివాదం పరిష్కారం

అనకాపల్లి: స్థానిక బెల్లం మార్కెట్‌లో కొద్ది రోజులుగా నిలిచిపోయిన లావాదేవీలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. కొలగార్లకు కూలి చెల్లింపులో ఏర్పడిన వివాదం కారణంగా ఈనెల 18 నుంచి బెల్లం మార్కెట్‌లో లావాదేవీలు నిలిచిపోయాయి. రైతులు ఇబ్బందులకు గురికాకుండా మార్కెట్ శాఖ జాయింట్ డైరెక్టర్ సుధాకర్, డిప్యూటీ డైరెక్టర్ వీరన్న, జిల్లా అధికారి రవికిరణ్, మార్కెట్ కార్యదర్శి శకుంతల పలు మార్లు రెండు వర్గాల వారితో చర్చించి సమస్యను పరిష్కరించారు. వర్తకులు రెండు రోజులకు ఒక సారి కొలగార్లకు కూలి నగదు చెల్లించేలా ఒప్పందం కుదిరింది. యార్డులో బెల్లం దిమ్మలు పోయినట్టయితే దగ్గరలో పోలీస్‌స్టేషన్‌లో లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసి, చోరీ చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకునేందుకు ఒప్పందం జరిగిందని మార్కెట్ కార్యదర్శి శంకుతల తెలిపారు. మార్కెట్‌లో ఏడు బ్లాకుల్లో బెల్లం లావాదేవీలు జరుగుతున్నాయని, సార్వత్రిక ఎన్నికల అనంతరం సీసీ కెమెరాలను ఏర్పాటు చేయనున్నట్టు ఆమె చెప్పారు.

ఓపెన్ ఇంటర్‌లో 22.88 శాతం ఉత్తీర్ణత

విశాఖ విద్య: సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో నిర్వహించిన టెన్త్, ఇంటర్మీడియెట్ పరీక్షల ఫలితాలను గురువారం ప్రకటించారు. జిల్లాలో ఇంటర్మీడియెట్ పరీక్షలకు 1,145 మంది విద్యార్థులు హాజరుకాగా 262 మంది ఉత్తీర్ణులయ్యారు. 22,88 శాతం ఉత్తీర్ణత సాధించారు. దీంతో ఇంటర్మీడియెట్ ఫలితాలు పరంగా రాష్ట్రం సూచికలో ఆఖరి స్థానంలో నిలిచింది. అదే విధంగా పదో తరగతి పరీక్షలకు 920 మంది హాజరుకాగా వీరిలో 115 మంది పాసయ్యారు. తద్వారా 12.50 శాతం ఉత్తీర్ణత నమోదైంది. దీంతో ఫలితాల్లో రాష్ట్ర సూచికలో జిల్లాకు 24 స్థానం దక్కింది. సప్లిమెంటరీ పరీక్షలు జూన్ 1 నుంచి 8 వరకు నిర్వహిస్తున్నట్లు డీఈవో చంద్రకళ వెల్లడించారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఈ నెల 29 నుంచి మే 4 వరకు ఫీజు చెల్లించాలన్నారు.

- వలస పక్షులు వస్తుంటాయి పోతుంటాయి..

ముత్యాలనాయుడు లోకల్

స్థానిక నేతలే ముద్దు.. నాన్ లోకల్ మాకొద్దు.. ఇదీ అనకాపల్లి పార్లమెంటు ఓటర్లు ప్రతి ఎన్నికల్లో ఇస్తున్న విలక్షణమైన తీర్పు. తమకు ఎలాంటి ఎంపీ కావాలన్న విషయంలో వారికి స్పష్టమైన అభిప్రాయం ఉంది. స్థానికుడైతేనే తమ మధ్య ఉంటూ తమ కష్టసుఖాలు పట్టించుకుంటాడని వారి నమ్మకం. ఎంత హంగు ఆర్భాటం చేసినా.. ఎంత డబ్బు విరజిమ్మినా వారు ప్రతిసారీ అదే తీర్పు చెప్పారు. ఈ సార్వత్రిక ఎన్నికల్లో కూడా లోకల్-నాన్ లోకల్ అంశం ప్రధానంగా చర్చకు రావడంతో అనకాపల్లి ఎన్నికపై సర్వత్రా ఆసక్తి పెరిగింది.

స్థానికులకే పట్టం.. అనకాపల్లి ఇష్టం

- పార్లమెంటు ఎన్నికల్లో ప్రతిసారీ లోకల్ అభ్యర్థికి విజయం
- అతిరథమహారథులు వచ్చినా స్థానికేతరులకు తిరస్కారం
- ఇక్కడ ఓటమి పాలైన అల్లు అరవింద్, నూకారపు సూర్యప్రకాశరావు
- పూసపాటి ఆనంద గజపతిరాజుకూ తప్పని పరాజయం

సాక్షి, అనకాపల్లి: అనకాపల్లి పార్లమెంటు నియోజకవర్గం దాదాపుగా గ్రామీణ ప్రాంతం. ఒకటి రెండు సెమీ అర్బన్ పట్టణాలు మినహా మిగతా జిల్లా అంతటా పల్లె వాతావరణమే కనిపిస్తుంది. అందుకే కాబోలు వారి మనసుల్లో స్వచ్ఛత.. ఆలోచనల్లో స్పష్టత గోచరిస్తుంది. అనకాపల్లి ఓటర్లు ప్రతి ఎన్నికల్లో పరిణతి ప్రదర్శించారు. ఈ పార్లమెంట్ నియోజకవర్గం ఏర్పడినప్పటి నుంచి నేటి వరకు 15 లోక్‌సభ ఎన్నికలు జరిగితే.. అన్నింటా స్థానికులనే గెలిపించారు. డబ్బులు వెదజల్లినా, హామీలు గుప్పించినా నాన్ లోకల్ అభ్యర్థులను నమ్మలేదు. వారికి విజయం అందించలేదు. వారిని ఓడించి ఇంటికి పంపించిన సందర్భాలు అనేకం. రెండు వైపుల నుంచి స్థానికులే పోటీకి దిగినప్పుడు వారి మంచితనం, పార్టీల విశ్వసనీయత, కుల సమీకరణల ఆధారంగా విజయాలు సాధించారు. అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గం 1962లో ఏర్పడింది. మొదటి పార్లమెంట్ సభ్యుడిగా మిస్సుల సూర్యనారాయణమూర్తి గెలుపొందారు. అప్పటి నుంచి నేటి వరకు 15 పార్లమెంట్ ఎన్నికలు జరిగాయి. అపర కుబేరులైనా.. సినిమా గ్లామర్ ఉన్నా.. పారిశ్రామికవేత్తలు రంగంలోకి దిగినా అనకాపల్లి ఓటర్లు స్థానికతకే పట్టం కట్టారు. 2009 పార్లమెంట్ ఎన్నికల్లో ప్రముఖ సినీ నిర్మాత, చిరంజీవి బావమరిది అల్లు అరవింద్ ప్రజారాజ్యం పార్టీ నుంచి పోటీ చేశారు. పారిశ్రామికవేత్త, సూర్య పత్రిక అధినేత నూకారపు సూర్యప్రకాశరావు టీడీపీ నుంచి రంగంలో ఉన్నారు. అయినా వీరిద్దరిపై స్థానికుడైన సబ్బం హరి (కాంగ్రెస్)నే 52,912 ఓట్ల మెజారిటీతో గెలిపించారు. 1980 పార్లమెంట్ ఎన్నికల్లో విజయనగరం రాజవంశీయుడైన పూసపాటి ఆనంద గజపతిరాజు జేఎన్‌పీ(ఎస్) పార్టీ నుంచి పోటీ చేశారు. తన ప్రత్యర్థి కాంగ్రెస్‌కు చెందిన స్థానికుడు ఎస్.ఆర్.ఎ.ఎస్.అప్పలనాయుడు చేతిలో 35,936 ఓట్ల తేడాతో పరాజయం పాలయ్యారు.



బూడి వెర్సెస్ సీఎం రమేష్

ఈసారి పార్లమెంట్ ఎన్నికల్లో కూడా మరోమారు స్థానికుడు, స్థానికేతరుడు తలపడుతున్నారు. వైఎస్సార్‌సీపీ తరఫున బూడి ముత్యాలనాయుడికి పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అవకాశం కల్పించారు. కడప జిల్లాకు చెందిన బీజేపీ అభ్యర్థి సీఎం రమేష్ ఆయనకు ప్రధాన ప్రత్యర్థిగా ఉన్నారు. రాయలసీమకు చెందిన వ్యక్తిని పోటీకి నిలపడం అందరినీ ఆశ్చర్యపరిచింది. ధనబలంతో నెగ్గుకురావచ్చన్నది వారి అభిప్రాయం కావచ్చు గానీ జనబలం ముందు ఆ పప్పులేవీ ఉడకవని ముత్యాలనాయుడు ధీమాగా ఉన్నారు. ఆయన కేవలం స్థానికుడే కాదు.. అచ్చమైన గ్రామీణ వాసి. డిప్యూటీ సీఎం అయినా తన స్వగ్రామం తారువలో క్యాంపు కార్యాలయం ఏర్పాటు చేసుకొని ఇక్కడి నుంచే కార్యకలాపాలు సాగించారు. మాడుగుల నియోజకవర్గాన్ని కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి పరిచారు. రాష్ట్రమంతా ఇక్కడి ప్రగతి గురించి చర్చించుకునేలా చేశారు. ఈ నేపథ్యంలో లోకల్-నాన్ లోకల్ ఫీలింగ్ ఈసారి మరింతగా ఉండే అవకాశముందని విశ్లేషకుల అంచనా.

బీసీ వెలమ.. ఓసీ వెలమ మధ్య సమరం

అనకాపల్లి పార్లమెంట్ పరిధిలో అత్యధిక సామాజికవర్గమైన బీసీ వెలమ కులస్తులే ఎప్పుడూ గెలుపును నిర్ణయించేది. గత పార్లమెంట్ ఎన్నికల్లో బీసీ కొప్పెల వెలమ కులస్తులు ఇక్కడి నుంచి పోటీ చేశారు. ఈ ఎన్నికల్లో తొలిసారిగా ఓసీ వెలమకు చెందిన రమేష్ బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. దీంతో ఆయనకు మద్దతు పలికేందుకు బీసీ వెలమలు అయిష్టంగా ఉన్నారు. వైఎస్సార్‌సీపీ నుంచి పోటీ చేస్తున్న తమ సామాజిక వర్గానికి చెందిన బూడి ముత్యాలనాయుడిని గెలిపించుకోవాలని కొప్పెల వెలమలు పట్టుదలగా ఉన్నట్టు విస్తృత చర్చ జరుగుతోంది.

ఈ అభిప్రాయాన్ని తుడిచివేసేందుకు మాడుగుల నుంచి బండారు సత్యనారాయణమూర్తిని (బీసీ వెలమ)ను సీఎం రమేష్ రంగంలోకి దింపినా.. ఆ ప్రయత్నం బెడిసికొట్టింది. అక్కడ కూడా లోకల్-నాన్ లోకల్ వివాదం చుట్టుముట్టింది. ఇక్కడ నేతలెవరూ లేనట్టు పెందుర్తి నుంచి అభ్యర్థిని తీసుకురావడమేమిటని టీడీపీ వర్గాలు పెదవి విరుస్తున్నాయి.

నేటి నుంచి జిల్లాలోనే కేంద్ర ఎన్నికల పరిశీలకులు



కేంద్ర ఎన్నికల పరిశీలకులకు పుష్పగుచ్ఛం అందిస్తున్న కలెక్టర్ రవిపట్టన్‌శెట్టి

తుమ్మపాల : జిల్లాలో పకడ్బందీగా, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా జిల్లాలో తీసుకుంటున్న చర్యలు, పోలింగ్ కేంద్రాల వద్ద కల్పిస్తున్న మౌలిక సదుపాయాలు, భద్రతాపరమైన ఏర్పాట్లు, ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు వంటి అంశాలను కేంద్ర ఎన్నికల సంఘం ప్రతినిధులు, ఎన్నికల పరిశీలకులు దల్జీత్ సింగ్ మంగత్, డాక్టర్ రాకేష్ కుమార్, కె.మోహన్ ఎం.దహికర్ ఇకపై ఇక్కడ నుంచే పరిశీలిస్తారని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి తెలిపారు. గురువారం కలెక్టరేట్‌కు వచ్చిన వారిని కలెక్టర్‌తో పాటు, ఎస్పీ కె.వి.మురళీకృష్ణ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలుకు తీసుకుంటున్న చర్యలు, సార్వత్రిక ఎన్నికల నిర్వహణ, ముందస్తు ఏర్పాట్లు సంసిద్ధత, ప్రణాళికలపై వివరించినట్లు తెలిపారు.

ఆర్ఏఆర్ఎస్‌లో క్యాంపు కార్యాలయం

ఎన్నికల పరిశీలకులు శుక్రవారం నుంచి పట్టణంలో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం (ఆర్ఏఆర్ఎస్)లో ఏర్పాటు చేసిన ప్రత్యేక క్యాంపు కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారని కలెక్టర్ తెలిపారు. ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదులు, వినతులను వారికి సమర్పించవచ్చన్నారు. సాధారణ పరిశీలకులైన దల్జీత్ సింగ్ నర్సీపట్నం, మాడుగుల, చోడవరం, నియోజకవర్గాలను పర్యవేక్షిస్తారని, ఎన్నికల సమస్యలు, ఫిర్యాదులపై ఫోన్ నంబర్ 75696 24104కు నేరుగా వారితో మాట్లాడవచ్చన్నారు. డాక్టర్ రాకేష్ కుమార్ పెందుర్తి, అనకాపల్లి, యలమంచిలి, పాయకరావుపేట నియోజకవర్గాల్లో ఎన్నికల ప్రక్రియ పరిస్థితులను పరిశీలిస్తారని, ఫిర్యాదులపై నేరుగా ఆయనకు ఫోన్ నెం.75696 34085కు మాట్లాడవచ్చన్నారు. మోహన్ ఎం.దహికర్ జిల్లాలో నెలకొన్న శాంతిభద్రతల పరిస్థితులు, తీసుకున్న ముందస్తు చర్యలను పర్యవేక్షిస్తారని, వారి ఫోన్ నంబర్ 93478 21621లో నేరుగా మాట్లాడవచ్చన్నారు.

పైకి పొత్తులు.. లోపల కత్తులు

- టీడీపీ బీజేపీ జనసేన పొత్తు పెటాకులు
- ఆధిపత్య పోరుతో ఘర్షణలు
- అభ్యర్థుల ప్రచారానికి మిత్రులు అల్లంత దూరం
- ఆ పార్టీల అభ్యర్థుల ఒంటరి పోరు
- కలిసి రాని క్యాడర్‌తో బేజారు



సాక్షి, విశాఖపట్నం: టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు కుస్తీలు పడుతున్నారు. పైకి పొత్తులని చెప్పుకుంటున్నా లోపల కత్తులు నూరుకుంటున్నారు. సీటు గండిపడిన చోట ఆయా పార్టీల నాయకులు, శ్రేణులు మిత్రుల తరపున ప్రచారానికి దూరంగా ఉంటున్నారు. దీంతో అభ్యర్థులు తమ పార్టీ క్యాడర్‌తోనే ప్రచారం చేసుకుంటున్నారు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో ఈ పరిస్థితి స్పష్టమవుతోంది. పొత్తు పొత్తే.. పోరు పోరే అన్నట్టు వ్యవహరిస్తున్నారు. ఒకట్రెండు చోట్ల మినహా మిగిలిన స్థానాల్లో మనస్ఫూర్తిగా సహకరించేందుకు ముందుకు రావడం లేదు.

- పాయకరావుపేట నియోజకవర్గంలో ఆది నుంచి టీడీపీ అభ్యర్థి వంగలపూడి అనితపై జనసేన నేత గెడ్డం బుజ్జి గుర్రుగానే ఉన్నారు. గతంలో ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు అనిత బుజ్జిపై అక్రమ కేసులు బనాయించడం, ఆయన భూములపై సిట్‌కు ఫిర్యాదు చేయడం, కాపు సామాజికవర్గానికి చెందిన ఓ వ్యక్తిని చెప్పుతో కొట్టడం వంటి పరిణామాలను మరిచిపోని ఆయన అనితకు సహకరించేది లేదని తేల్చి చెప్పేశారు. ఓటమి భయంతో అనితతో పాటు నాగబాబు, అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్‌లు బుజ్జి ఇంటికి వెళ్లి బుజ్జగించినా పూర్తి స్థాయిలో ప్రచారంలో పాల్గొనడం లేదని తెలుస్తోంది.
- యలమంచిలి జనసేన అభ్యర్థి సుందరపు విజయకుమార్ అభ్యర్థిత్వాన్ని తీవ్రంగా వ్యతిరేకించిన టీడీపీ ఆశావహుడు ప్రగడ నాగేశ్వరరావు ఆరంభంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. ఇప్పుడు ఆయన ఒకింత మెత్తబడినా టీడీపీ క్యాడర్ మాత్రం సుందరపు ప్రచారానికి ఆసక్తి చూపడం లేదు. అలాగే విజయకుమార్ తనను చంపబోయాడని ఆరోపణలు గుప్పించిన జనసేనకు చెందిన మత్స్యకార నాయకుడు ఎరిపిల్లి కిరణ్ రెబల్‌గా నామినేషన్ దాఖలు చేశారు.
- విశాఖ దక్షిణ నియోజకవర్గంలో జనసేన అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్‌పై ఆ సీటును ఆశించిన ముగ్గురు నేతలు ఆది నుంచి గుర్రుగానే ఉన్నారు. వీరిలో మూగి శ్రీనివాసరావు పార్టీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. 39వ వార్డు కార్పొరేటర్ సాధిక్ సహా మరికొందరు జనసేనకు దూరంగా ఉన్నారు. అక్కడ బీజేపీ క్యాడరూ కానరావడం లేదు.
- ఐదేళ్లు ప్రజల్లో లేకుండా సీటు దక్కించుకున్న విశాఖ ఉత్తర నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి విష్ణుకుమార్‌రాజుకు అక్కడ జనసేన నుంచి పూర్తి స్థాయిలో సహకారం అందడం లేదు. ఇక టీడీపీ, శ్రేణులూ అరకొరగానే ఆయన ప్రచారంలో పాల్గొంటున్నారు.
- విశాఖ తూర్పు నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి వెలగపూడి ధోరణితో జనసేన నుంచి సహకారం అంతంత మాత్రంగానే ఉంది.
- గాజువాక టీడీపీ అభ్యర్థి పల్లా శ్రీనివాసరావుకు ఆశించిన స్థాయిలో బీజేపీ, జనసేనల నుంచి మద్దతు లభించడం లేదు. ఒకరిద్దరు నాయకులు తప్పా క్యాడర్ పల్లా ప్రచారంలో పాల్గొనడం లేదు.
- ఇక భీమిలి టీడీపీ అభ్యర్థి గంటా శ్రీనివాసరావుకు బీజేపీ, జనసేన నుంచి మద్దతు అరకొరగా ఉంది. తాజాగా మంగళవారం రాత్రి ఎన్నికల ప్రచారంలో టీడీపీ, జనసేన కార్యకర్తలు తన్నుకున్నారు. దీనిపై ఒకరిపై ఒకరు పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు.

ఇలా ఉమ్మడి విశాఖ జిల్లాలో పొత్తుల స్థానంలో కత్తులు దూసుకుంటుండడం, మిత్ర పక్ష నేతలు కలిసి రాకపోవడంతో కూటమి అభ్యర్థులు బేజారెత్తిపోతున్నారు.

మందకొడిగా హోం ఓటింగ్ నమోదు

- వృద్ధులు, దివ్యాంగులు ఇంటి నుంచే ఓటు వేసేందుకు ఈసీ అవకాశం
- నమోదుకు నేడే ఆఖరు


- II

జేఈఈ మెయిన్స్‌లో ర్యాంకుల పంట


- సహాస్ హనుమంతుకు ఓబీసీ కేటగిరి-901, (ఓపెన్ ర్యాంక్ -4485)
- బిక్కి సిద్ధార్థకు ఓబీసీ కేటగిరి-1104 (ఓపెన్ ర్యాంక్ -8047)



సహాస్ హనుమంతు



బిక్కి సిద్ధార్థ



హర్షవర్ధన్

తుమ్మపాల : జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో అనకాపల్లి విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారని నారాయణ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కోన విశ్వేశ్వరరావు తెలిపారు. కొండకొప్పాక గ్రామానికి చెందిన సహాస్ హనుమంతు (హాల్ టికెట్ నంబర్ 240310562985) విశాఖలోని నారాయణ సరస్వతి భవన్‌లో చదువుతున్నాడు. ఓపెన్ ర్యాంక్ -4485, ఓబీసీ కేటగిరిలో 901 ర్యాంక్ సాధించాడు. అతని తండ్రి నేతాజీ జీవీఎంసీ గాంధీ నగరం హైస్కూల్లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. శారదానగర్‌కు చెందిన బిక్కి సిద్ధార్థ (హాల్ టికెట్ నంబర్ 240310168159)కు ఓపెన్ ర్యాంక్-8047, ఓబీసీ కేటగిరి ర్యాంక్- 1104 సాధించారు. ఆ విద్యార్థి తండ్రి నాగేశ్వరరావు మారికవలస నారాయణ కళాశాల ఏజీఎంగా పనిచేస్తున్నారని తెలిపారు. వారికి కళాశాల తరపున అభినందనలు తెలిపారు.

రాజాం విద్యార్థి ఘనత

బుచ్చెయ్యపేట : జేఈఈ మెయిన్స్ పరీక్షల్లో రాజాం గ్రామానికి చెందిన ఉమ్మడివరపు హర్షవర్ధన్ ప్రతిభ చూపాడు. ఇటీవల జరిగిన జేఈఈ మెయిన్స్ పరీక్షకు హాజరైన హర్షవర్ధన్ 98.5 శాతం పర్సంటైల్ సాధించాడు. ఇంటర్‌లో కూడా హర్షవర్ధన్ 980 మార్కులతో మెరిట్ సాధించాడు. ప్రతిష్టాత్మకమైన ఎన్ఐటీలో ఇంజినీరింగ్ బీటెక్ సీటు సాధించేందుకు హర్షవర్ధన్ అత్యధిక ప్రతిభ కనబరచడంపై పలువురు ఆ విద్యార్థిని అభినందించారు.

చందనోత్సవానికి విస్తృత ఏర్పాట్లు



సింహగిరిపై బందోబస్తుపై ఈవోతో చర్చిస్తున్న ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి

సింహాచలం: చందనోత్సవం రోజున భక్తులకు ఇబ్బంది లేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నట్లు సింహాచలం దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి తెలిపారు. వచ్చేనెల 10న సింహగిరిపై నిర్వహించనున్న వరాహ లక్ష్మీనృసింహస్వామి చందనోత్సవానికి సంబంధించి బందోబస్తు ఏర్పాట్లను గురువారం నార్త్ ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి పరిశీలించారు. దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి, ఇంజినీరింగ్ అధికారులతో కలిసి సింహగిరిపై పర్యటించారు. ఉచిత దర్శనంతో పాటు ప్రత్యేక దర్శన క్యూ లైన్ల గురించి చర్చించారు. భక్తుల రద్దీ ఉండే ప్రాంతాల్లో ఎలాంటి ఏర్పాట్లు చేయాలో పరిశీలించారు. సింహగిరి బస్టాండ్ నుంచి లోవతోట మీదగా ప్రారంభమయ్యే ఉచిత దర్శన క్యూకి సమీపం నుంచే సింహగిరికి బస్సులు కూడా తిరిగే ఆస్కారం ఉండడంతో అక్కడ ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో చర్చించారు. గోపాలపట్నం లా అండ్ ఆర్డర్ సీఐ సురేష్, ఎస్ఐ రామకృష్ణ, దేవస్థానం ఈఈలు శ్రీనివాసరాజు, రాంబాబు, డీఈ నాగేశ్వరరావు, ఏఈ హరి, ఏఈవో పాలూరి నరసింగరావు పాల్గొన్నారు.

మందకొడిగా హోం ఓటింగ్ నమోదు

- వృద్ధులు, దివ్యాంగులు ఇంటి నుంచే ఓటు వేసేందుకు ఈసీ అవకాశం
- నమోదుకు నేడే ఆఖరు
- అర్హులైన వారు ఆర్వో దగ్గర దరఖాస్తు చేసుకోవాలి

మహారాణిపేట: జిల్లాలో హోం ఓటింగ్ నమోదు మందకొడిగా సాగుతోంది. ఓటరు జాబితాలో పేరు ఉన్న వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి దగ్గర నుంచి ఓటు వేసే అవకాశాన్ని ఎన్నికలు కమిషనర్ కల్పించింది. 85 ఏళ్లకు పైబడిన వృద్ధులు, 40 శాతం దివ్యాంగులు(సదరం సర్టిఫికెట్) ఇందుకు అర్హులు. అయితే ఇప్పటివరకు అతి తక్కువ సంఖ్యలో హోం ఓటింగ్ కోసం దరఖాస్తులు అందాయి.

1,523 మంది దరఖాస్తు

ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లాలో ఈ నెల 18 నుంచి 22వ తేదీ వరకు బీఎల్‌వోలు ఓటర్ల జాబితా ప్రకారం అర్హుల ఇళ్లను సందర్శించారు. వారి వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేసుకుని.. వారి అంగీకారంతో ఫారం 12డీని అందజేశారు. పూర్తి చేసిన దరఖాస్తులను వారి నుంచి స్వీకరిస్తున్నారు. ఇలా ఇప్పటివరకు జిల్లాలో 1,523 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో వృద్ధులు 976, దివ్యాంగులు 547 మంది ఉన్నారు. ఓటర్ల జాబితా ప్రకారం జిల్లాలో మొత్తం 25,777 మంది హోం ఓటింగ్‌కు అర్హులు. వీరిలో వృద్ధులు 8,956, దివ్యాంగులు 16,821 మంది ఉన్నారు. ఇంటి దగ్గర నుంచి ఓటు హక్కు వినియోగానికి సంబంధించి దరఖాస్తు చేసుకోవడానికి శుక్రవారం ఆఖరి రోజుగా నిర్ణయించారు. నేటి సాయంత్రంలోపు ఆయా నియోజకవర్గ ఆర్వోలకు వ్యక్తిగతంగా దరఖాస్తు అందజేయాల్సి ఉంటుంది.

మే 7న ఓటింగ్

హోం ఓటింగ్‌లో పేర్లు నమోదు చేసుకున్న వారికి మే 7న ఓటింగ్ జరుగుతుంది. ఈ నెల 29వ తేదీ నాటికి బ్యాలెట్ పత్రం పూర్తి అవుతుంది. ఈ పత్రం ద్వారా ఒక్కొక్కరు రెండు ఓట్లు వేయాల్సి ఉంటుంది. ఒకటి పార్లమెంట్, రెండోది అసెంబ్లీ బ్యాలెట్ పత్రం ఇస్తారు. 7న అందుబాటులో లేకపోతే వారికి ఇంకో ఆప్షన్ కింద 9వ తేదీ కూడా ఓటింగ్‌కు అవకాశం ఇచ్చారు. ఇప్పటికే హోం ఓటింగ్ కిట్ సిద్ధం చేసి ఆర్వోలకు అందజేశారు. పార్లమెంట్, అసెంబ్లీ కోసం రూపొందించిన బ్యాలెట్ పత్రాన్ని హోం ఓటర్ పూర్తి చేసి సీల్డ్ బాక్సులో వేయాల్సి ఉంటుంది. అనంతరం ఈ బాక్సులను సంబంధిత ఆర్వోలకు అప్పగిస్తారు. ఆర్వోలు ఈ బాక్సులను స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపరుస్తారు. ఈ మొత్తం ప్రక్రియను చిత్రీకరిస్తారు.

51 బృందాలు సిద్ధం

ఇందుకోసం జిల్లాలో మొత్తం 51 బృందాలు సిద్ధం చేశారు. భీమిలిలో 9, విశాఖ తూర్పు 6, దక్షిణ 6, ఉత్తర12, పశ్చిమ 8, గాజువాక 5, పెందుర్తిలో ఐదు బృందాలు ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. ఒక్కొక్క బృందంలో స్థానిక బీఎల్‌వో, పోస్టల్ బ్యాలెట్ ఇన్‌చార్జి, గజిటెడ్ అధికారి, మార్కెడ్ కాపీ ఇన్‌చార్జి, మైక్రో అబ్జర్వర్, వీరి భద్రత కోసం ఓ పోలీస్.. ఈ ప్రక్రియను చిత్రీకరించేందుకు ఓ వీడియోగ్రాఫర్ ఉంటారు. హోం ఓటులో పేరు నమోదు చేసుకున్న వారు పోలింగ్ స్టేషన్‌కు వెళ్లి ఓటు వేసే అర్హతను కోల్పోతారు. ఓటర్ జాబితాలో ఆ పేరు ఓటు వేసినట్టుగా మార్కు చేసి ఉంటుంది.

ప్రచార పర్వం



ఈ నెల పింఛన్ ఇంటికి రాలేదు బాబు: బుచ్చెయ్యపేట మండలం మల్లంలో ఎమ్మెల్యే అభ్యర్థి కరణం ధర్మశ్రీ వద్ద వృద్ధురాలి ఆవేదన



ఓట్ల వర్షం కురవాలయ్యా: నాతవరం మండలంలో అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే గణేష్‌కు మహిళల దీవెనలు



ఇదిగో మా పార్టీ గుర్తు: మాకవరపాలెం మండలం జి.కోడూరులో యువతికి కరపత్రాలు అందిస్తున్న హీరో సాయిరాంశంకర్



ఇదే మన గుర్తు: కోటవురట్ల మండలం పి.కె.పల్లిలో వృద్ధురాలికి ఫ్యాను గుర్తు చూపిస్తున్న పాయకరావుపేట ఎమ్మెల్యే అభ్యర్థి జోగులు

వైఎస్సార్ సీపీలోకి బీజేపీ నేత పార్వతమ్మ


- ముఖ్యమంత్రి జగన్ సమక్షంలో చేరిక



పార్వతమ్మకు కండువా కప్పి ఆహ్వానిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి,పాడేరు: వైఎస్సార్‌సీపీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో బీజేపీ నేత, మాజీ జీసీసీ డీఎం కురుసా పార్వతమ్మ వైఎస్సార్‌సీపీలో చేరారు. వైఎస్సార్‌సీపీ పాడేరు అసెంబ్లీ అభ్యర్థి మత్స్యరాస విశ్వేశ్వరరాజు ఆధ్వర్యంలో ఆమె బుధవారం శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్లలో సీఎంను కలిశారు. ఆమెకు జగన్ పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్వతమ్మ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అభివృద్ధి, అన్నివర్గాల ప్రజలకు జరిగిన మేలు, గిరిజనుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇవ్వడం తనను ఎంతగానో ఆకర్షించాయన్నారు. దీనిలో భాగంగానే వైఎస్సార్‌సీపీలో చేరినట్టు ఆమె తెలిపారు.

జనసేన, టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరికలు



ఎమ్మెల్యే కన్నబాబు రాజుతో వైఎస్సార్ సీపీలోకి చేరిన శ్రేణులు

అచ్యుతాపురం: మండలంలోని పూడిమడక శివారు కడపాలెంకు చెందిన టీడీపీ, జనసేన పార్టీ శ్రేణులు వైఎస్సార్‌సీపీలోకి చేరాయి. వీరందరికీ గురువారం యలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబురాజు పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. మేరుగు సోమన్న, చింతకాయల అప్పలరాజు, సూరాడు బాబూరావు, మైలపల్లి గణేశ్, పిరాది మారయ్య టీడీపీ నుంచి చేరగా, మేరుగు రాజయ్య, చెల్లూరు నగేశ్, సోమేశ్ జనసేన నుంచి చేరారు. సుమారు 20 కుటుంబాల వారు వైఎస్సార్ సీపీలోకి చేరడంతో ఆ గ్రామంలో పార్టీ మరింత బలం పుంజుకుంది.

బుచ్చెయ్యపేట: మండలంలోని దిబ్బిడి గ్రామానికి చెందిన టీడీపీ, జనసేన పార్టీల నాయకులు పలువురు వైఎస్సార్ సీపీలో చేరారు. గ్రామానికి చెందిన పల్లె అప్పారావు, సియాద్రి మహేష్, పెదిరెడ్ల తాతారావు తదితరులు తమ కుటుంబ సభ్యులతో కలిసి గురువారం రాత్రి ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ సమక్షంలో వైఎస్సార్ సీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరికి విప్ ధర్మశ్రీ పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. జెడ్పీటీసీ దొండా రాంబాబు, పార్టీ మండలాధ్యక్షుడు కె. అచ్చింనాయుడు, వైస్ ఎంపీపీ గొంపా చినబాబు, సర్పంచ్ పెదిరెడ్ల మాణిక్యం, మాజీ సర్పంచ్‌లు గొంపా అప్పారావు, అద్దెపల్లి రామారావు పాల్గొన్నారు.



వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ, జనసేన నాయకుల్ని ఆహ్వానిస్తున్న విప్ ధర్మశ్రీ

రాజ్‌నాథ్‌సింగ్ ప్రసంగం విద్వేషపూరితం

- ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలి
- స్టీల్‌ప్లాంట్‌ను రక్షిస్తామని చెప్పని కేంద్రమంత్రి
- ఎన్నికల్లో సీఎం రమేష్‌కు బుద్ధి చెప్పాలి
- సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం

అనకాపల్లి: అనకాపల్లి ఎన్నికల ప్రచారంలో కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ విద్వేషపూరిత ప్రసంగంపై ఎన్నికల అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల్లో తమ ప్రభుత్వం వద్ద ఉన్న అభివృద్ధి ప్రణాళికలు, ఏజెండాలు వెల్లడించకుండా ఆర్టికల్ 370 రద్దు, శ్రీ రామమందిరం గురించి అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. రాష్ట్రానికి సంబంధించి పోలవరం ప్రాజెక్టుకు నిధులు, విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఉపసంహరణ ప్రకటన, సొంత గనుల కేటాయింపు వంటి ప్రధాన అంశాలను విస్మరించి అధికారంలోకి వస్తే ఒకే దేశం ఒకే ఎలక్షన్ అమలు చేస్తామని చెప్పడం ప్రజాస్వామిక హక్కులను, విలువలను దెబ్బతియ్యడమేనని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల ప్రసంగాల్లో మత విద్వేషాలను రెచ్చగొట్టి లబ్ధి పొందడానికి బీజేపీ పథకం ప్రకారం వ్యవహరిస్తోందని, ప్రజలు అప్రమత్తమై బీజేపీ అభ్యర్థి సీఎం రమేష్‌ను, ఆ పార్టీకి మద్దతు ఇస్తున్న టీడీపీ, జనసేన పార్టీలను, దానికి అంటకాగుతున్న పార్టీలను ఓడించడం ద్వారా దేశ ఐక్యతను, మత సామరస్యాన్ని కాపాడాలన్నారు.

సీఎం రమేష్‌కు చిత్తశుద్ధి ఉంటే స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను ఉపసంహరించుకుంటున్నట్లు ప్రధాని మోడీతో ప్రకటించి, ప్లాంట్‌కు సొంత గనులు కేటాయిస్తున్నట్లు చెప్పాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడుకు ఇంగ్లిష్ రాదని తక్కువ చేసి మాట్లాడడం విడ్డూరంగా ఉందని, ఈ జిల్లావారికి సరిగ్గా మాట్లాడడం రాదని సీఎం రమేష్ పదేపదే చెప్పడం జిల్లా ప్రజలను అవమానపరచడమేనన్నారు. మన జిల్లాకు వలస వచ్చి పచ్చని పల్లెల్లో విద్వేషాలు రెచ్చగొట్టాలని చూస్తున్న ఈ వలస పక్షిని ఓడించేందుకు జిల్లా ప్రజలు సిద్ధంగా ఉన్నట్లు ఆయన తెలిపారు.

రాజ్‌నాథ్‌సింగ్ ప్రసంగంలో మూసివేసిన తుమ్మపాల, ఏటికొప్పాక, తాండవ సుగర్ ఫ్యాక్టరీల పునరుద్ధరణ ప్రస్తావన లేకపోవడం అంటే జిల్లా ప్రజలను విస్మరించడమేనని, ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తూ వివిధ రూపాల్లో ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తున్న బీజేపీ ఎంపీ అభ్యర్థిపై అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

వైఎస్సార్‌సీపీతోనే 'విశాఖ విజన్' సాధ్యం



విజన్ విశాఖ కరపత్రాన్ని చూపుతున్న మంత్రి బొత్స సత్యనారాయణ

ఎంవీపీ కాలనీ: వైఎస్సార్‌సీపీ గెలుపుతోనే విశాఖ నగరం అభివృద్ధి విజన్ సాధ్యమవుతుందని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. గురువారం లాసన్స్ బే కాలనీలోని వైఎస్సార్‌సీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ క్యాంపు కార్యాలయంలో ఆయన పార్టీ శ్రేణులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విజన్ విశాఖ పేరిట కరపత్రాన్ని విడుదల చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ విశాఖ నగరాన్ని అత్యుత్తమంగా తీర్చిదిద్దేందుకు ఐదు అంశాలతో కూడిన కరపత్రాన్ని రూపొందించామన్నారు. పారిశ్రామిక కారిడార్, సమగ్ర పట్టణ ప్రణాళిక, మౌలిక వసతుల కల్పన, ప్రమాణాలతో కూడిన ప్రజాజీవనానికి సామాజిక సదుపాయాలు, సుస్థిర అభివృద్ధితో కూడిన అంశాలను ఇందులో పొందుపరిచినట్టు చెప్పారు. వచ్చే ఐదేళ్ల పాలనలో విజన్ విశాఖ పేరిట వీటిని అభివృద్ధి చేస్తామన్నారు. విశాఖపట్నం అభివృద్ధిపై సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక ఆలోచన ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ గెలుపుతో రానున్న ఐదేళ్లలో విశాఖ నగర ముఖచిత్రం మారుతుందని బొత్స వెల్లడించారు. వైఎస్సార్‌సీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ గెలుపు అనంతరం చేపట్టబోయే కార్యక్రమాలతో కూడి కరపత్రాన్ని కూడా మంత్రి ఆవిష్కరించారు. బొత్స ఝాన్సీని అఖండ మెజారిటీతో గెలిపించాలని విశాఖ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గం వ్యాప్తంగా ఇంటింటా ఈ కరపత్రాలు పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవిరెడ్డి, కార్యదర్శి జీవీ కృష్ణారావు, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు కృపాజ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫీజు గడువు 30

విశాఖ విద్య: పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫీజును ఈ నెల 30వ తేదీ లోపు చెల్లించాలని డీఈవో చంద్రకళ ఒక ప్రకటనలో తెలిపారు. ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు దీనిపై తగిన శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. రెగ్యులర్, ఫెయిలైన విద్యార్థుల వివరాలు, అదే విధంగా పరీక్ష రుసుము తదితర అంశాలను అందరికీ తెలిసేలా పాఠశాలలో నోటీసు బోర్డు ఏర్పాటు చేయాలని సూచించారు. పరీక్ష ఫీజును గడువులోగా చెల్లించేలా విద్యార్థులకు అవగాహన కల్పించి, సకాలంలో నామినల్ రోల్స్ ఆన్‌లైన్ చేయాలని ఆదేశించారు.

వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎంగా సందీప్



తాటిచెట్లపాలెం: ఈస్ట్ కోస్ట్ రైల్వే, వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్(డీసీఎం)గా కె.సందీప్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ సీనియర్ డీసీఎంగా పనిచేసిన అఖిలేష్ కుమార్ త్రిపాఠి సంబల్‌పూర్ డివిజన్‌కు సీనియర్ డివిజనల్ ఆపరేషన్స్ మేనేజర్‌గా బదిలీ అయ్యారు. సందీప్ ఇండియన్ రైల్వే ట్రాఫిక్ సర్వీస్ ద్వారా రైల్వేలో ప్రవేశించారు. ఈయన 2013 ఇండియన్ సివిల్ సర్వీస్ బ్యాచ్‌కు చెందిన వారు. ఇంతకు ముందు ఈయన ఖుర్దారోడ్ డివిజన్‌లో సీనియర్ డివిజనల్ ఆపరేషన్స్ మేనేజర్‌గా పనిచేశారు. రైల్వేలో అసిస్టెంట్ ఆపరేషన్స్ మేనేజర్‌గా తన కెరీర్‌ను ప్రారంభించిన సందీప్ ఈస్ట్ కోస్ట్ రైల్వేలో పలు హోదాలతోపాటు వాల్తేర్ డివిజన్, వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌కు ఏరియా మేనేజర్‌గా కూడా గతంలో పనిచేశారు.

జూనియర్ సివిల్ న్యాయమూర్తుల బదిలీ

విశాఖ లీగల్: విశాఖలో విధులు నిర్వహిస్తున్న ముగ్గురు జూనియర్ సివిల్ న్యాయమూర్తులకు బదిలీ అయింది. మూడో అదనపు జూనియర్ సివిల్ న్యాయమూర్తిగా విధులు నిర్వర్తిస్తున్న ఎం.శ్రీనివాసరావుకు విజయనగరం స్పెషల్ జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్‌గా బదిలీ అయింది. ఆయన స్థానంలో చిత్తూరు జిల్లా పుంగనూరు ప్రధాన జూనియర్ సివిల్ న్యాయమూర్తి జి.కార్తీక బదిలీపై వస్తున్నారు. ఐదో అదనపు జూనియర్ సివిల్ న్యాయమూర్తి యు.మాధురి శ్రీకాకుళం జిల్లా పలాస జూనియర్ సివిల్ న్యాయమూర్తిగా బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో చిత్తూరు జిల్లా పుంగనూరు ఒకటో అదనపు జూనియర్ సివిల్ న్యాయమూరి సింధు గుర్రం బదిలీపై వస్తున్నారు. గాజువాక జూనియర్ సివిల్ న్యాయమూర్తిగా విధులు నిర్వర్తిస్తున్న వై.ప్రేమలత విజయనగరం జిల్లా చీపురుపల్లి జూనియర్ సివిల్ న్యాయమూర్తిగా బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో అనకాపల్లి ప్రధాన జూనియర్ సివిల్ న్యాయమూర్తి పి.ప్రదీప్ బదిలీపై వస్తున్నారు.

మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్ రద్దు

తాటిచెట్లపాలెం: విజయవాడ డివిజన్ పరిధిలో జరుగుతున్న ఆధునికీకరణ పనుల కారణంగా మచిలీపట్నం–విశాఖపట్నం–మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్‌ను రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ తెలిపారు. మచిలీపట్నం–విశాఖపట్నం(17219) ఎక్స్‌ప్రెస్ ఈ నెల 29 నుంచి మే 26వ తేదీ వరకు, విశాఖపట్నం–మచిలీపట్నం(17220) ఎక్స్‌ప్రెస్ ఈ నెల 30 నుంచి మే 27వ తేదీ వరకు రద్దయింది. ప్రయాణికులు ఈ మార్పును గమనించి సహకరించాలని ఆయన కోరారు.

కొత్త తలనొప్పులు

- ఒకే రకమైన పేర్లతో పలువురు నామినేషన్లు
- ఓటర్లు గమనించకుంటే ఓటు తారుమారు?
- సమస్యను అధిగమించేందుకు అభ్యర్థులు తర్జనభర్జనలు



విశాఖ సిటీ : సార్వత్రిక ఎన్నికల్లో అభ్యర్థులకు కొత్త తలనొప్పులు వచ్చేలా ఉన్నాయి. ఒకే విధమైన పేర్లు అభ్యర్థులను టెన్షన్‌కు గురి చేస్తున్నాయి. ఓటర్లు ఏ మాత్రం ఏమరపాటుగా ఉన్నా ఓటు తారుమారయ్యే ప్రమాదం ఉందని పార్టీలు కలవరపడుతున్నాయి. దిట్టుబాటు ఎలా అన్న మీమాంసలో కొట్టుమిట్టాడుతున్నాయి. ఎన్నికల నామినేషన్ల పర్వం ముగిసింది. పోటీ చేసే అభ్యర్థులతో పాటు వారి కుటుంబ సభ్యులతో సైతం డమ్మీ నామినేషన్లు వేయించారు. ఇదిలా ఉంటే.. కొంత మంది స్వతంత్ర, కొత్త పార్టీల నుంచి అభ్యర్థులు వేసిన నామినేషన్లతో ప్రధాన పార్టీల అభ్యర్థుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.


ఒకే పేరుతో..

కొన్ని నియోజకవర్గాల్లో ఒకే పేరుతో నామినేషన్లు రావడం విశేషం. ప్రధాన పార్టీల అభ్యర్థుల ఇంటి పేరు లేదా అసలు పేరుకు పోలినట్లుగా స్వతంత్ర, కొత్త పార్టీల నుంచి అభ్యర్థులు నామినేషన్లు వేయడం గమనార్హం. ప్రధానంగా విశాఖ దక్షిణ నియోజకవర్గం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి వాసుపల్లి గణేష్‌కుమార్ పోటీ చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ నుంచి వాసుపల్లి సంతోష్ కుమార్ కూడా నామినేషన్ వేశారు. ఇక్కడ ఏమరపాటుగా కేవలం ఇంటి పేరును చూస్తే తికమకపడినట్లే. అలాగే గాజువాకలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పల్లా శ్రీనివాసరావు పోటీలో ఉన్నారు. అదే నియోజకవర్గం నుంచి జాతీయ జనసేన పార్టీ అభ్యర్థిగా పల్లి శ్రీనివాసరావు నామినేషన్ వేశారు. ఈ పేరు కూడా దాదాపుగా పోలినట్లే ఉంది. భీమిలిలో టీడీపీ అభ్యర్థిగా గంటా శ్రీనివాసరావు ఎన్నికల బరిలో ఉన్నారు. ఇక్కడ కూడా జాతీయ జనసేన పార్టీ అభ్యర్థిగా గంటా శ్రీనివాసరావు అనే అభ్యర్థిగా పోటీలో ఉన్నారు. ఇక్కడ ఇద్దరి పేర్లు ఒకేలా ఉండడం గమనార్హం.

అభ్యర్థుల్లో టెన్షన్

ఇంటి పేరు లేదా అసలు పేరుకు పోలినట్లుగా మరి కొన్ని నామినేషన్లు రావడంతో ప్రధాన పార్టీల అభ్యర్థుల్లో టెన్షన్ మొదలైంది. ఓటర్లు అభ్యర్థుల పేర్లను పూర్తిగా గమనించకుంటే ఒకరికి వేయాల్సి ఓటు మరొకరికి వేసే అవకాశం ఉంటుంది. ఇది తమ విజయావకాశాలను దెబ్బతీసే ప్రమాదముందని అభ్యర్థులకు ఆందోళన చెందుతున్నారు. అయితే నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణ తరువాత ఎంత మంది పోటీలో ఉంటారన్న విషయంపై స్పష్టత వస్తుంది. ఒకవేళ ఒకే రకమైన పేర్లతో ఉన్న అభ్యర్థులు బరిలో ఉంటే.. ఈ గందరగోళం నుంచి బయటపడడానికి అనుసరించాల్సిన వ్యూహాలపై తర్జనభర్జన పడుతున్నారు. ఈ విషయాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని భావిస్తున్నారు.

విద్యుత్ షాక్‌కు గురై హెల్పర్ మృతి



మృతుడు శివన్నారాయణ

మునగపాక: విధి నిర్వహణలో విద్యుత్ హెల్పర్ గురువారం ఉదయం మృత్యువాతకు గురయ్యాడు. ఇంటి పెద్ద దిక్కుగా నిలిచిన హెల్పర్ మృతి చెందడంతో కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు. పెందుర్తి మండలం వేపగుంటకు చెందిన పీతల శివన్నారాయణ(42) 15 సంవత్సరాలుగా మునగపాక మండలం చూచుకొండలో స్థానికంగా విద్యుత్తు హెల్పర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఇక్కడే సొంతిల్లు నిర్మించుకుని కుటుంబ సభ్యులతో నివాసం ఉంటున్నాడు. గురువారం ఉదయం 9 గంటల ప్రాంతంలో విద్యుత్ స్తంభంపై పనులు చేపడుతుండగా, ఒక్కసారిగా షాక్‌కు గురై కింద పడిపోయాడు. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్ఐ పి.ప్రసాదరావు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని అనకాపల్లి వంద పడకల ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మేకల కాపరి మృతి !

మాడుగుల రూరల్: మండలంలో సత్యవరం గ్రామానికి చెందిన మేకలు కాపరి బోరా పెంటయ్య (65) మృతి చెందాడు. రోజు మాదిరిగానే బుధవారం తన మేకలు మందను తోలుకుని వెళ్లాడు. రాత్రి 8 గంటలైనా సరే తిరిగి మేకలు మందను తోలుకుని ఇంటికి చేరలేదు. మేకలు మాత్రం జంపెన సమీపంలో పొలాల్లో ఉన్నాయి. పెంటయ్య ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు వెతకగా, అర్ధరాత్రి అక్కడ విగతజీవిగా కనిపించాడు. కొన్నిరోజులు ఎండలు విపరీతంగా కాస్తుండటంతో వడదెబ్బకు గురై మృతి చెందినట్లు భావిస్తున్నారు. గురువారం ఆయనకు అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు.

క్లుప్తంగా

రేపు గాంధీ కూరగాయల మార్కెట్ బంద్

అనకాపల్లి: స్థానిక గాంధీ కూరగాయల మార్కెట్‌లో ఈనెల 27న ఎటువంటి లావాదేవీలు నిర్వహించబోమని శ్రీగౌరీ హోల్‌సేల్ కాయగూరల వర్తకసంక్షేమ సంఘం అధ్యక్షుడు సూరి శెట్టి జగ్గమహేశ్వరరావు, కార్యదర్శి వై.ఎస్.భద్రంలు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. హోల్‌సేల్ కాయగూరల వర్తకుడు దివంగత కోడూరు వెంకటరావు సంతాప సభను ఆ రోజు మార్కెట్ ఆవరణలో నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఎటువంటి లావాదేవీలు జరగవని, రైతులు, ప్రజలు సహకరించాలని ఆయనకోరారు.

ఆరోగ్యంపై అవగాహన సదస్సు రేపు

అనకాపల్లి: గవరపాలెం గౌరీ గ్రంథాలయంలో ఈనెల 27వ తేదీ సాయంత్రం 5గంటలకు మూడు సులభమైన దశల్లో ఆరోగ్యం, క్షేమం అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్టు గ్రంథాలయం కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా కెనడా దేశానికి చెందిన వైద్యులు సూరిశెట్టి వరహా సూరిఅప్పారావు పాల్గొనున్నట్టు పేర్కొన్నారు.

నేడు పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేత

కశింకోట: మండలంలోని బయ్యవరం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతులు కారణంగా శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఏఈ పి.శ్రీనివాసరావు తెలిపారు. బయ్యవరం, విసన్నపేట, తేగాడ, వెదురుపర్తి, రామన్నపాలెం గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

- కన్నూరుపాలెం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతులు కారణంగా శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.రామకృష్ణ తెలిపారు. కన్నూరుపాలెం, తీడ, చెరకాం, సుందరయ్యపేట, జి.భీమవరం ,అచ్చెర్ల, మోసయ్యపేట గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు పేర్కొన్నారు.

వారపు సంత వెలవెల



బోసిపోయిన వారపు సంత

కశింకోట: స్థానిక వారపు సంత ప్రాంగణం గురువారం సూర్య ప్రతాపంతో బోసిపోయింది. ఉదయం ఎండ అధికంగా ఉండడంతో సంతకు రావడానికి ఎవరూ సాహసించలేదు. దీంతో కూరగాయలు, ఆకుకూరలు, మసాల దినుసులు, పండ్ల దుకాణాలువెలవెలబోయాయి. ఎండ తీవ్రత భరించలేక దుకాణదారులు సమీపంలోని దుకాణాల వద్దకు చేరుకొని సేద తీరారు. మధ్యాహ్నం 3.30 గంటలకు ఎండ తీవ్రత తగ్గడం, తర్వాత మబ్బు వేసి వాతావరణం చల్లబడడంతో ప్రజలు యథావిధిగా సంతకు వచ్చి కొనుగోళ్లు చేశారు.

ఘనంగా అమ్మవార్ల పండగ

రాంబిల్లి: మండలంలోని కొత్తపట్నంలో నూకాలమ్మ తల్లి, కొండవారపాలెం గ్రామంలో దుర్గాలమ్మ తల్లి పండగలను గురువారం ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకుని, పసుపు కుంకుమలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. అన్న సమారాధన, పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

అనకాపల్లి సినిమాలు

ప్రాజెక్టు	: రాజా
పారిజాత పర్వం	: సత్యనారాయణస్క్రీన్-1
టెనెంట్	: సత్యనారాయణస్క్రీన్-2
గీతాంజలి	: షిర్డీసాయి
ఫ్యామిలీ స్టార్	: పర్తిసాయి
రత్నం	: వెంకటేశ్వర
పారిజాత పర్వం	: శ్రీసత్య
డీజే టిల్లు-2	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 66 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఎ పాజిటివ్-12 యూనిట్లు, బి పాజిటివ్-21 యూనిట్లు, ఒ పాజిటివ్-31 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (ఫోన్ నంబర్ 9703619706)ను సంప్రదించవచ్చు.

ఊరు మారింది



గోకివానిపాలెంలో జగనన్న కాలనీ



గ్రామంలో నిర్మించిన అంతర్గత సిమెంట్ రోడ్డు



మోసయ్యపేట-గోకివానిపాలెం గ్రామాలను కలుపుతూ నిర్మించిన రోడ్డు



గ్రామంలో నిర్మించిన రామాలయం



సామాజిక భవనం



గోకివానిపాలెం గ్రామానికి నిర్మించిన తారు రోడ్డు



గోకివానిపాలెంలో వీధి దీపాలు

అభివృద్ధి పథంలో మోసయ్యపేట

కశింకోట: మండలంలోని మారుమూల గ్రామమైన మోసయ్యపేట అభివృద్ధి పథంలో పరుగులు తీస్తోంది. ప్రధాన పంచాయతీ గ్రామం కంటే శివారు గ్రామం గోకివానిపాలెం మరింతగా అభివృద్ధి చెందింది. మోసయ్యపేట పంచాయతీ అచ్చెర్ల పంచాయతీలో శివారుగా ఉండేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత దీన్ని 2021లో విడదీసి శివారు గోకివానిపాలెంతో కలిసి పంచాయతీగా ఏర్పాటు చేశారు. సుమారు వెయ్యి మంది జనాభా కలిగిన ఈ చిన్న పంచాయతీ ప్రగతిబాటలో పయనిస్తోంది. మోసయ్యపేట, గోకివానిపాలెం గ్రామాలను కలుపుతూ రూ.10 లక్షలతో సిమెంట్ రోడ్డు ఏర్పాటు చేశారు. దీంతో సుమారు నాలుగు కిలో మీటర్ల మేర ఆ రెండు గ్రామాల మధ్య ప్రయాణ దూరం తగ్గింది. లేదంటే ఈ రెండు గ్రామాల మధ్య బంధుత్వాలు ఉన్న నేపథ్యంలో వారంతా వాహనాలపై చేరుకోవాలంటే మోసయ్యపేట గ్రామస్తులు అచ్చెర్ల మీదుగా సుమారు 4 కిలోమీటర్ల దూరం తిరిగి వెళ్లాల్సి వచ్చేది. అదే ఇప్పుడు రెండు గ్రామాలను కలుపుతూ కాలిబాట ఉన్న రహదారిని సిమెంట్ రోడ్డుగా ఏర్పాటు చేయడం దూరం తగ్గింది. ఈ రెండు గ్రామాల్లోను పలు సిమెంట్, తారు రోడ్లను నిర్మించారు. నాడు-నేడులో ప్రాథమిక పాఠశాలను అభివృద్ధి చేశారు.

అభివృద్ధి పనుల వివరాలు

పనులు	విలువ రూ.లక్షల్లో
మోసయ్యపేట-గోకివానిపాలెం గ్రామాలను కలుపుతూ సిమెంట్ రోడ్డు	10
నాడు-నేడులో పాఠశాల అభివృద్ధి	12
అంతర్గత సిమెంట్ రోడ్డు	10
ఇంటింటి కుళాయిలు	13
గోకివానిపాలెంలో తారు రోడ్డు	36
గోకివానిపాలెంలో అంతర్గత సిమెంట్ రోడ్లు	20
రామాలయం నిర్మాణం	36
సామాజిక భవనం	3
శ్మశానవాటికకు మెటల్ రోడ్డు	6
ఇంటింటి కుళాయిలకు వ్యయం	6.50
అచ్చెర్ల రోడ్డు-గోకివానిపాలెం మధ్య వీధి దీపాలు	8
వెల్‌నెస్ సెంటర్ నిర్మాణ	20.80

సుమారు 250 ఇళ్లకు కుళాయి కనెక్షన్లు ఏర్పాటు చేసి మంచినీటి సమస్య పరిష్కరించారు. మోసయ్య

మండలం	:	కశింకోట
పంచాయతీ	:	మోసయ్య పేట
శివారు గ్రామం	:	గోకివానం పాలెం
జనాభా	:	1000 మంది

పేటలో 20 మందికి వైఎస్సార్ లే-అవుట్‌లో స్థలాలు, ఇళ్లు మంజూరు చేశారు. ఇక ప్రధాన గ్రామం కంటే శివారున ఉన్న గోకివానిపాలెం అధికంగా అభివృద్ధి చెందిందని చెప్పవచ్చు. రూ.1.20 కోట్లతో అభివృద్ధి పనులు జరిగాయి. కొత్త అచ్చెర్ల జంక్షన్ నుంచి గోకివానిపాలెం వైపు సుమారు రెండు కిలో మీటర్ల పొడవున తారు రోడ్డు నిర్మించారు. గ్రామంలో అంతర్గత సిమెంట్ రోడ్డు, పొలాల్లోని ఇళ్లకు, శ్మశానవాటికకు సిమెంట్ రోడ్లు నిర్మించారు. గ్రామస్తుల సౌకర్యార్థం సామాజిక భవనం నిర్మించారు. నాలుగు కిలో మీటర్ల రోడ్డు పొడవునా వీధి దీపాలను ఏర్పాటు చేశారు. రూ.36 లక్షలు వెచ్చించి రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ప్రోత్సాహంతో దాతల విరాళాలతో రామాలయాన్ని అందంగా నిర్మించి, ప్రారంభించారు. సుమారు 200 ఇళ్లకు కుళాయి కనెక్షన్లు ఇచ్చి మంచినీటి సమస్య పరిష్కరించారు. జగనన్న లే-అవుట్‌లో 40 మందికి ఇళ్లు మంజూరు చేశారు. రెండు గ్రామాలకు కలిపి వెల్‌నెస్ సెంటర్ భవనాన్ని రూ.20.80 లక్షలతో నిర్మిస్తున్నారు. ఇలా మారుమూల గ్రామాల్లో కోట్లలో అభివృద్ధి పనులు జరగడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రూపురేఖలు మారాయి



మా గ్రామం రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. ఎన్నో అభివృద్ధి పనులు నిర్వహించారు. అంతర్గత సిమెంట్ రోడ్లు నిర్మించారు. శ్మశానవాటికకు రోడ్డు నిర్మించారు. రామాలయాన్ని అందంగా తీర్చిదిద్దారు.దీంతో ఎంతో సౌకర్యవంతంగా ఉంది.

–దాలిబోయిన దేవుడమ్మ, గోకివానిపాలెం

నీటి ఇబ్బందులు తప్పాయి



గతంలో వీధి కుళాయిల వద్ద నిరీక్షించి తాగునీరు పట్టుకోవలసి వచ్చేది. ఇప్పుడు ఇంటింటా కుళాయిలు ఏర్పాటు చేశారు. దీంతో ఇబ్బంది తప్పింది. సమృద్ధిగా నీరు అందుతోంది. ఎంతో ఆనందంగా ఉంది.

–బొట్టా లక్ష్మి, గోకివానిపాలెం.

వైఎస్సార్‌సీపీ పాలనలో గాంధీ కలలు సాకారం



ఓటువేయాలని వృద్ధురాలిని కోరుతున్న మందపాటి సునీత, మందపాటి జానకీరామరాజు



80వ వార్డులో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్



తిమ్మరాజుపేటలో ఇంటింటా ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

- ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్

అనకాపల్లి: గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం వైఎస్సార్‌సీపీ పాలనలోనే నెరవేరిందని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ అన్నారు. గవరపాలెం 80వ వార్డులో కార్పొరేటర్ కొణతాల నీలిమాభాస్కర్ ఆధ్వర్యంలో గురువారం గడప గడపకు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. దేశంలో మరే రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయని విధంగా మన రాష్ట్రంలో గ్రామ, వార్డు సచివాలయాలను ఏర్పాటు చేసి గ్రామీణులు సుపరిపాలన అందించి, గాంధీజీ కలలను నెరవేర్చారని తెలిపారు. ప్రతి గ్రామంలోను రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్‌నుభవనాలను ఏర్పాటు చేసిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదేనని తెలిపారు. బలహీన వర్గాల ప్రజలకు సంక్షేమానికి ప్రభుత్వం పలు పథకాలు అమలు చేసిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సూర్యనారాయణమూర్తి దేవస్థానం చైర్మన్ కె.ఎం.నాయుడు, వైద్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొడ్డేడ లక్ష్మీనరసింహరావు, పార్టీ నాయకులు పీలా శ్రీనివాసరావు, దాడి నారాయణరావు, పొలమరశెట్టి మురళీ, పెంటకోట అప్పలనాయుడు, కర్రి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

82వ వార్డు పరిధిలో...

82వ వార్డు పరిధిలోని ఉమ్మలాడ జంక్షన్, ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్డు రహదారిలో మాజీ కౌన్సిలర్ దాడి బోగలింగేశ్వరరావు ఇంటి వద్ద నుంచి వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత, పట్టణ పార్టీ అధ్యక్షుడు జానకీరామరాజు గడప గడపకు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో వార్డు పార్టీ నేతలు కాండ్రేగుల సతీష్‌కుమార్, దాడి సూరిబాబు, మద్దాల గణేష్, పొలమరశెట్టి శ్రీను, కాండ్రేగుల జగ్గారావు, గయిపూరి రాజు, కడిమిశెట్టి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

81వ వార్డు పరిధిలో....

81వ వార్డు పరిధిలో పీలా లక్ష్మీసౌజన్యరాంబాబు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ సతీమణి నివేదిత ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మే 13న జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

యలమంచిలిలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరాలి

మునగపాక: యలమంచిలి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరాలని ఆ పార్టీ మండల బీసీ సెల్ అధ్యక్షుడు కాండ్రేగుల జగన్ కోరారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ,ఎమ్మెల్యే అభ్యర్థులు బూడి ముత్యాలనాయుడు, యు.వి. రమణమూర్తిరాజుల విజయం కోరుతూ తిమ్మరాజుపేటలో గురువారం రాత్రి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు రానున్న రోజుల్లో అందాలంటే ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని కోరారు. మోసపూరిత హామీలతో ప్రజల్లోకి వస్తున్న కూటమికి తగిన గుణపాఠం చెప్పాలన్నారు.

రాంబిల్లి: మండలంలోని పలు గ్రామాల్లో గురువారం వైఎస్సార్‌సీపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యే అభ్యర్థి యు.వి. రమణమూర్తి రాజు, ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాల నాయుడును గెలిపించాలని కోరుతూ గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ప్రచారం చేశారు.

నేడు 83 వార్డులో ప్రచారం

అనకాపల్లి: స్థానిక 83వ వార్డు పరిధి లక్ష్మీదేవిపేట, మల్లమ్మ తల్లి ఆలయం వద్ద నుంచి శుక్రవారం సాయంత్రం 4గంటల నుంచి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించనున్నట్టు కార్పొరేటర్ జాజుల ప్రసన్న లక్ష్మి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గ్రామాల అభివృద్ధి



వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ గొర్లి సూరిబాబు

అనకాపల్లి: గ్రామాల రూపురేఖలు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే మారాయని, పట్టణ ప్రాంతాన్ని మైమరిపించేలా గ్రామాల్లో సౌకర్యాలు మెరుగుపడ్డాయని ఎంపీపీ గొర్లి సూరిబాబు అన్నారు. మండలంలో అక్కిరెడ్డిపాలెం పంచాయతీ గణేష్‌నగర్ కాలనీలో గురువారం రాత్రి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాలు మరింతగా అభివృద్ధి చెందాలంటే రానున్న ఎన్నికల్లో మరోసారి సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకునే బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఉపముఖ్యమంత్రి, ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు, ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్‌లను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ నారిపిన్ని ప్రసాద్, సచివాలయం కన్వీనర్ అమిటి ధనలక్ష్మి, పార్టీ నాయకులు ఎ.రాజశేఖర్, కోరుకొండ గోవింద్, తామర్ల నరేష్, అప్పారావు, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ జగన్ మరోసారి సీఎం కావడం ఖాయం



మాట్లాడుతున్న ఎంపీపీ జయలక్ష్మి

మునగపాక: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం సాధించి, జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి సీఎం కావడం తథ్యమని ఎంపీపీ మళ్ల జయలక్ష్మి అన్నారు. మునగపాక తంపరమూలకు చెందిన రైతులు,పార్టీ కార్యకర్తలతో గురువారం రాత్రి సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాల ద్వారా అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగిందని చెప్పారు. ఎంపీ,ఎమ్మెల్యే అభ్యర్థులు బూడి ముత్యాలనాయుడు, యు.వి. రమణమూర్తిరాజులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.పార్టీ ప్రచార కార్యదర్శి కాండ్రేగుల మణికంఠ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మునగపాక సర్పంచ్ దిమ్మల అప్పారావు,వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు,మాజీ జెడ్పీటీసీ మళ్ల సంజీవరావు,సచివాలయాల మండల కన్వీనర్ పొలిమేర గణేష్ ,ఎంపీటీసీ సూరిశెట్టి రాము పార్టీ నేతలు ఆడారి కాశీబాబు,టెక్కలి కొండలరావు,కోనపల్లి రామ్మోహనరావు,సూరిశెట్టి కన్నారావు, పెంటకోట వెంకట్,ఆదినారాయణ,దాడి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

30న జాబ్‌మేళా

తుమ్మపాల: పట్టణంలోని డీమార్ట్ సమీపంలో గల శివ ఐటీఐ కళాశాలలో ఈ నెల 30న జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ కె.ఎస్.శివనారాయణ ఓ ప్రకటనలో తెలిపారు. ఫాక్స్‌కాన్, స్కైగార్డ్ ఎలక్ట్రానిక్స్, భారత్ బయోటెక్, ఇన్ఫిలోమ్, పానాసోనిక్,డిక్సాన్,ఇసుజుమోటార్స్,కెఎస్‌హెచ్,హోండాయ్, మోబీస్, జయభేరి కంపెనీల్లో టెక్నీషియన్ ఉద్యోగాలకు ఆయా కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని తెలిపారు. టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ, బీటెక్ ఉత్తీర్ణులైన 35 ఏళ్ల వయస్సులోపు నిరుద్యోగులు ఇంటర్వ్యూలకు హాజరుకావచ్చని పేర్కొన్నారు. ఆయా ఉద్యోగాలను బట్టి నెలకు రూ.12 నుంచి రూ.16 వేల వరకు జీతం , ఇన్సెంటివ్, భోజనం, వసతి, రవాణా సౌకర్యం కల్పిస్తారని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు సర్టిఫికెట్ల జిరాక్స్‌లతో హాజరు కావాలన్నారు. మరింత సమాచారం కోసం 9247836912, 9440641267 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

యలమంచిలి అసెంబ్లీ స్థానానికి చివరి రోజు 11 నామినేషన్లు

యలమంచిలి రూరల్: సార్వత్రిక సంగ్రామంలో తొలి ఘట్టమైన నామినేషన్ల స్వీకరణ గడువు గురువారంతో ముగిసింది. యలమంచిలి అసెంబ్లీ స్థానానికి చివరి రోజు గురువారం 8 మంది 11 నామినేషన్లు దాఖలు చేశారు.బీఎస్పీ తరపున లంబ శ్రీనివాసరావు, నవరంగ్ కాంగ్రెస్ పార్టీ తరపున బొచ్చా జి.శ్యామల, సుందరపు అర్జున్ కుమార్,ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ తరపున తనకాల అనంతరామ నరసింగరావు, పెదపూడి రాము,పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా తరపున బొర్రా అమ్మాజమ్మలు చివరిరోజు తమ నామినేషన్ పత్రాలను ఆర్వోకు అందజేశారు.

అనకాపల్లి అసెంబ్లీకి 5 నామినేషన్లు

తుమ్మపాల: అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గ స్థానానికి చివరి రోజు గురువారం ఐదుగురు నామినేషన్లు దాఖలు చేశారు. స్వతంత్ర అభ్యర్థులుగా ఆల్ల సత్తిరాజు, ఒమ్మి వెంకటయాదవ్, కామిరెడ్డి భరత్‌కుమార్, ప్రజా ప్రస్థాన పార్టీ తరపున తోట వెంకటసాయి ముకుంద్, రిపబ్లికన్ పార్టీ తరపున దొమ్మిసి అప్పారావు రిటర్నింగ్ అధికారి ఎం.జాహ్నవికి గురువారం నామినేషన్లు దాఖలు చేశారు.

విద్యుత్ కార్యాలయం వద్ద ఉద్యోగుల నిరసన

కశింకోట: విద్యుత్ షాక్‌తో మృతిచెందిన జూనియర్ లైన్‌మెన్ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక ఏపీఈపీడీసీఎల్ సబ్ డివిజన్ కార్యాలయం వద్ద సంస్థ ఉద్యోగులు, సిబ్బంది గురువారం ఆందోళన చేశారు. విద్యుత్ షాక్‌తో మునగపాక మండలం చూచుకొండలోమృతి చెందిన జూనియర్ లైన్‌మెన్ పీతల శివ సూర్యనారాయణ కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు.

చిరుధాన్యాలపై అవగాహన అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ రఫీ

అనకాపల్లి: వ్యాపారాలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే చిరుధాన్యాలపై అవగాహన, ఆసక్తి పెంచుకోవాలని ఇండియన్ ఇనిస్టిట్యూట్ మిల్లెట్స్ రిసోర్స్ సెంటర్ హైదరాబాద్ శాస్త్రవేత్త డాక్టర్ డి.రఫీ అన్నారు. అంతర్జాతీయ చిరుధాన్యాల వ్యాపారాభివృద్ధి అనే అంశంపై మండలంలో తుమ్మపాల ఎస్‌వీడీఎస్ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రతి వ్యక్తి చిరుధాన్యాలపై ఆసక్తిపెంచుకున్నట్టు ఆయన తెలిపారు. రైతులు మెట్టప్రాంతాల్లో చిరుధాన్యాలు పండించేందుకు ఎక్కువగా మక్కువ చూపుతున్నట్టు చెప్పారు. ఎస్‌వీడీఎస్ వ్యవస్థాపకులు కాండ్రేగులు జోగినాయుడు పాల్గొన్నారు.

మలేరియా నివారణకు అవగాహన ర్యాలీ



కశింకోటలో పీహెచ్‌సీ సిబ్బంది నిర్వహిస్తున్న ప్రపంచ మలేరియా దినోత్సవ అవగాహన ర్యాలీ

కశింకోట: స్థానిక పీహెచ్‌సీలో గురువారం ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవ అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి తిరుపతిరావు ఆధ్వర్యంలో ఆరోగ్య సిబ్బంది ర్యాలీ జరిపారు. ఈ సందర్భంగా దోమలు వృద్ధి చెందకుండా జాగ్రత్తలు పాటించాలని, ప్రతి శుక్రవారం ఇళ్లలో నీటి నిల్వలు తొలగించి డ్రై డే పాటించాలని, దోమ తెరలు వాడాలని నినాదాలు చేశారు. అనంతరం వైద్యాధికారి తిరుపతిరావు మాట్లాడుతూ చలి, జ్వరం వస్తే రక్త పరీక్షలు చేయించుకుని చికిత్స పొందాలని సూచించారు.ఆరోగ్య విస్తరణాధికారి సత్యనారాయణరావు, సిబ్బంది పరమానందరావు, రామ్మూర్తి, సత్యవతి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఆయుర్వేదంలో ఆపరేషన్లు లేకుండా వ్యాధుల నివారణ

కశింకోట: ఆయుర్వేద వైద్య విధానంలో శస్త్ర చికిత్సలు లేకుండా వ్యాధులను తగ్గించవచ్చని కన్నూరుపాలెం ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాఖ వైద్యాధికారి టి. శిరీష అన్నారు. మండలంలోని కన్నూరుపాలెం ఆయుర్వేద వైద్యశాలలో గురువారం రోగులకు ఆయుర్వేద వైద్యంపై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కిడ్నీలో రాళ్లు, సైనసైటిస్, టాన్సిలైటిస్, వెన్ను సమస్యలు, సయాటిక, ఆనెలు, మొలలు, వెరికోజ్‌సిస్ తదితర వ్యాధులను శస్త్ర చికిత్సలు అవసరం లేకుండా తగ్గించవచ్చునన్నారు. జలుబు, దగ్గు, గొంతునొప్పి,తలనొప్పి, అజీర్ణం, అతిసారం, గ్యాస్, గాయాలు నివారణకు చికిత్స అందించి ఉచితంగా మందులు అందించనున్నట్లు తెలిపారు. దీర్ఘకాలికమైన కీళ్ల వాతం, మోకాళ్ల నొప్పులు, పక్షవాతం, చర్మ వ్యాధులు, ఆస్తమా, ఎలర్జీ, మహిళల వ్యాధులు, బొల్లి, నరాలు, కండరాల వ్యాధులకు చికిత్స, మందులు ఉన్నాయన్నారు. తల్లి, పిల్లలు, గర్భిణులకు వైద్యం అందిస్తామన్నారు. ఆరోగ్యవంతంగా ఉండటానికి యోగా, ధ్యానం ఆచరించాలన్నారు. ఇందు కోసం ఇన్‌స్ట్రక్టర్లను నియమించారని, వారు దీనిపై అవగాహన కలిగించి శిక్షణ ఇస్తున్నారన్నారు.

యోగాతో మానసిక ఒత్తిడి దూరం

అనకాపల్లి: మానసిక ఒత్తిడి నుంచి విముక్తి కలగాలంటే నిత్యం యోగా చేయాలని, యోగా ద్వారా శరీరంలో అనేక రకాలైన మార్పులు కలిగి ఆరోగ్యంగా జీవించవచ్చని భారత స్వాభిమాన్ ట్రస్టు, పతాంజలి యోగా సమితి అధ్యక్షులు డి.దొరమ్మనాయుడు అన్నారు. స్థానిక జార్జిక్లబ్ ఆవరణలో నిర్వహించిన ఉచిత యోగా శిక్షణ కార్యక్రమంలో రాష్ట్ర పతాంజలి యోగా సమితి ఉపాధ్యక్షుడు టి.ఎస్.వి.ప్రసాద్ గురువారం పాల్గొని యోగాసనాలను చేయించారు. అనంతరం ఆయనను కమిటీ సభ్యులు సత్కరించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ నిత్యం యోగా చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు బీఎస్ఎంకె జోగినాయుడు, బుద్ధ కాశీ విశ్వనాథ్, శ్రీనివాసరావు, జి.మంగయ్య, కె.వి.వి. సత్యనారాయణ, కర్రి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.